నదే పరమార్థంగా చిన్నపాటి ఉద్యోగాలను కూడ గ్రహించడం ఇక్కడి వారికి వీలు కల్గకుండా చేయడం, ఇక్కడివారిలో ఆంధ్రులంటే అసహ్యాన్ని కల్గించింది.

పైవిషయాలంతగా పాటించవలసిన అగత్యం లేదు. ఏలన రాష్ట్రశ్రేయస్సు దృష్ట్యా అవి లెక్కలోనివి కావు. అవసరమనుకుంటే కొన్ని హక్కులను కొంతకాలందాక కాక్షించి అట్టి శికాయతు కాస్కారంలేకుండా చేయవచ్చును. ఏ కొద్ది మందికి కల్గిన నష్టాన్నో పురస్కరించుకొని దేశ శ్రేయస్సును బలిచేయడం విద్యాధికుల మరియు నాయకుల ధర్మంకాదు. హైద్రాబాదు కమ్యూనిస్టుపార్టీ, పి. యస్. పి. మరియు హైద్రాబాదు సికింద్రాబాదు మునిసిపల్ కార్పొరేషన్లు విశాలాంధ్ర నిర్మాణమున కనుకూలంగానే తమ అభిప్రాయాలను వ్యక్తపరచినారు. కాంగ్రెసు పార్టీలోగూడ అధిక సంఖ్యాకులు విశాలాంధ్రను సమర్థిస్తున్నారు. కాంగ్రెసు ప్రజా ప్రతినిధులలో అధిక సంఖ్యాకులు విశాలాంధ్రనే కోరుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులే అన్నిటా సమర్థులు. కావున తెలంగాణ ప్రాంతపు అన్నిపార్టీల ప్రజా ప్రతినిధులుకలిసి తమ అభిప్రాయాన్ని ముక్తకంఠంతో చాటితే శ్రేయస్కరంగా ఉంటుంది. ఈ ఒక్క మార్గమే సమస్యను సులభంగా పరిష్కరిస్తుంది. ఇక్కడి ప్రజలు తమ ప్రతినిధులపై ఒత్తిడి తేవాలి. ప్రజాప్రతినిధు లిది ఎంత తొందరగా పరిష్కరిస్తే అంత మెరుగుగా ఉంటుంది వారి భావి.

తనదాకా రాని

# ధర్మ పన్నాలు

మధిర భానుమూర్తి

రామయ్యగారు ఎవరికేనా (ఎలాంటిపరిస్థితుల్లో ఉన్నవారికేనా) సలహా యివ్వగలరు. గతంలో చాలామందికి ఇచ్చారు. ఆ ఊళ్ళో ఆయనసలహా పుచ్చుకోనివాళ్లు అసలు ఉండరంటే ఆయన ఘనతకి అదే తార్కాణం. ఎంత క్లిష్టసమస్యనుంచైనా సునాయాసంగా బయటు పడటం రామయ్యగారి కొక్కరికే తెలుసు. ఎంత ప్రమాదంలోనైనా ధైర్యంగా నిలబడి ఎదుర్కోవటంలో రామయ్యగారు అందెవేసిన చెయ్యి. రెండుమూడురోజులు సెలవుకావలిస్తే ఊళ్ళో ఎవరేనా రామయ్యగారిని సంప్రతించవలసిందే. ఆ ఊరికి బదిలీకావలిస్తే రామయ్యగారు చేయించవలసిందే. ఆ ఊరి ప్రజలకి చాలా కంటకంగా తయారైన ఉద్యోగిని ఎక్కడికో బదిలీ చేయించాల్సినా రామయ్యగారే చేయించాలి. ఆ ఊళ్ళో స్కూలుపెట్టించిందెవరు? ఆఊరికి సత్రంకట్టించటానికి చందాలు వసూలు చేసిందెవరు? అక్కడ ఇవాళ అంత లైబ్రరీ ఉండటానికి కారకులెవరు? రామయ్యగారే! కాని, అన్నప్పుడూ కానప్పుడూ వారు తమ పలుకుబడిని వినియోగించరు.

ఈ పనులన్నీ చెయ్యాలని వారంతట వారికే తోచాలికాని ఇతరులుచెపితే అసలు చెయ్యరు. ఒకసారి ఒక పేదకుటుంబీకుడు భార్యావియోగుడై పిల్లలతో సంసారం యీదలేక, పిల్లలకోసం పునర్వివాహప్రయత్నం మానేసి కాలక్షేపం చేస్తూండగా దూరప్రాంతానికి బదిలీ అయింది. ఆయన వెంటనే రామయ్యగారి సహాయాన్ని అర్థించడంలో ఆశ్చర్యంఏముంది? కాని రామయ్యగారు ఆయన పరిస్థితినైనా గమనించకుండా "ఉద్యోగస్థుడికి ఒకఊరని ఏమిటి? ఎక్కడికి బదిలీచేస్తే అక్కడికి వెళ్ళాలిగాని ఎంతకాలంఅని ఆపగలం?" అన్నాడు. పాపం, ఆ కుటుంబీకుడు కళ్ళనీళ్ళపర్యంతరం అయి "అయ్యా! కష్టాల్లో ఉన్నాను. ఈ చిన్నపిల్లలతో మరోచోటికివెళ్ళి ఏంకాలక్షేపం చెయ్యగలను చెప్పండి? తమరు కనికరించకపోతే నేనేమవాలి?" అంటే ఆయన చాలాస్థిమితంగా "కష్టాలు మనుష్యులకి కాకపోతే ఇంకెవరికి వస్తాయయ్యా? మరి అవి వచ్చినప్పుడే ఓర్చుకోవాలి" అన్నాడు. ఈ మాట లన్న వారంరోజులకే రామయ్యగారి అప్పునికి

దూరప్రాంతానికి బదిలీ అయింది. ఈమాటవిన్న రామయ్యగారు ఖిన్నుడయాడు. తనవాడికి బదిలీయా? అందులోనూ ఎంతో దూరంగాఉన్న ఊరికా? ఇది కొంచెం కష్టంకలిగించింది రామయ్యగారికి. వెంటనే బ్రహ్మప్రయత్నంచేశాడు. బదిలీ ఆపించాడు.

కొన్నాళ్ళకు రామయ్యగారి ఆప్తుడొకడు ఉన్నతోద్యోగి అయాడు. ఆయనకు ఉద్యోగాలు ఇచ్చే అధికారంకూడా వచ్చింది. కాకిచేత కబురంపినా ఆ అధికారి రామయ్యగారు చెప్పినపని చేస్తాడని వదంతి. ఇదివిన్న ఒకబీద విద్యార్థి రామయ్యగార్ని ప్రాధేయపడ్డాడు. "అయ్యా! నాకుమంచి మార్కులువచ్చాయండి. మా స్కూలుకు ఫస్టువచ్చానండి. నాకు వచ్చినన్ని మార్కులు మన చుట్టుప్రక్కల ఎవరికీ రాలేదండి ఈ సంవత్సరం. కనుక నన్నుగురించి వారికి ఒక్కమాటు మీరు చెపితే నా కింత అన్నంపెట్టిన వారవుతారు." అన్నాడు. "సరేలేవయ్యా! చూద్దాం. మనం ఆయనతో ఇలాంటి వ్యవహారాలనుగురించి చెప్పకూడదు. ఆయన ఏదోకొన్ని పద్ధతులప్రకారం చేస్తూంటాడు. నేను కలుగజేసుకుని ఆయన్ను బాధపెట్టను. అదీకాక, నీకు మార్కులు బాగావచ్చాయన్నావుగా! ఇకనేం?" అన్నాడు. ఆ అబ్బాయి చేసేదేమీలేక దేవుడిమీదభారంవేసి వెళ్ళిపోయాడు. ఉద్యోగాలు వచ్చినవాళ్ళ జాబితాలో రామయ్యగారి కుమారుడున్నాడు. ఆ అబ్బాయికి మార్కులు చాల తక్కువ వచ్చాయి. అతనికన్న ఎక్కువ మార్కులు వచ్చినవాళ్ళకి ఉద్యోగాలులేవు.

రామయ్యగారిని గురించిన విషయాలు ఇంకా ఉన్నాయి. చిన్న విషయంనుంచి పెద్ద విషయందాకా రామయ్యగారి మనఃప్రవృత్తి యింతే. ఎవరేనా ఏదేనా బేరంచేస్తుంటే, "చాల్చాల్లేవయ్యా! ఎవరైనా వింటే నవ్విపోయేరు. ఎంతసేపు ఆ బేరమాడడం? అతను మాత్రం ఎంత తక్కువకని ఇవ్వగలడు? నువ్వు కొంటున్నావుగదా అని నష్టపడి అమ్ముకో మంటావా?" అని కసురుతాడు. తను కొనవలసి వచ్చేసరికి అరవీసె కొనేదానికి అరగంట బేరమాడుతాడు, "ఇదేంకొనే మొగమేనా?" అని ఆ వర్తకుడిచేత అనిపించుకునేదాకా.

అందుకనే రామయ్యగారు రచ్చబండమీద తరుచు చర్చనీయాంశమవుతారు. "ఇవేళ మన చినోన్ణి సుబ్బయ్యకొట్టాడు వాళ్ళదొడ్లో జామకాయలు కోశాడని. కొట్టొద్దనుగాని మరే అంత ఒళ్ళూపై తెలియకుండానా, రక్తాలు కారేలాగునా? అయినా, మధ్య ఈ రామయ్యకెందుకు నెప్పు? సరిగ్గా ఆ సమయానికి అక్కడికి తయారయాడు. వచ్చినవాడు వచ్చినట్టుండక "ఆఁ! కొడతారా? ఒళ్ళుచీలుస్తారా? ఇంకా సుబ్బయ్యకనక సరిపోయింది. నేనయితేనా? అంటూగింజుకున్నాడు." అన్నాడు ఒకయన. "వాడికున్నదే అది. ఇతరులగొడవల్లో అయితే ఎన్ని ధర్మపన్నాలేనా ఏకరువు పెడతాడు. తనదాకా వచ్చేసరికి ఈ ధర్మాలన్నీ మాయమవుతాయి. ఆయనగారి పుత్రుడు క్లాసులో కుర్రాడి పుస్తకం దొంగతనం చేసినప్పుడు హెడ్మాస్టరు ఇంత తాఖీదు పంపితే తన్నుకుచచ్చాడు. కుర్రాడిని బళ్ళోంచి తీసేస్తారని మహాగాభరాపడ్డాడు. అది తప్పించుకునేసరికి తల ప్రాణం తోకకొచ్చింది. ఇవన్నీ ఎవరికి తెలియవని. అప్పుడు తన కుర్రాడి ఒంటిమీద చెయ్యి వెయ్యలేకపోయాడేం? ఇంతఅయి, సిగ్గులేక తలెత్తుకు తిరుగుతూ, ఇతరులకి ధర్మపన్నాలు చెప్పడంకూడానా?" అన్నాడు మరొకాయన. ఆయననుగురించి ఈ విధంగా చెప్పుకుంటారు అందరూ. ఇతరులకి చెప్పే ధర్మాలు తనదాకా వచ్చేసరికి నిలబడకపోవడంవల్ల ఈ మాటలన్నీ ఆయనను అనటం.

ఈ ప్రవర్తన రామయ్యగారి కొక్కరికేకాదు. చాలామందికి ఉంటుంది. ఇతరులకు చెప్పినంత తేలికగా తన విషయంలో ఎందుకు తోచదని వీరు ఆలోచించరు. ఇతరులను తాము విమర్శించినట్టే తమని ఇతరులు విమర్శిస్తారని వీరు అనుకోరు. తమ విషయంలో అయితే నియమాలను సడలించుకోవచ్చునని వీరి నమ్మకము. ఇలాంటి వారిని సహించటం కష్టం.

ఈమధ్య ఒక స్వాములవారినిగురించి విన్నాం, వారు "నిష్కామకర్మ" గురించి మహోపన్యాసాలిచ్చారు. తుచ్ఛమైన వాంఛలకు లోబడకూడ

దన్నారు. సర్వం త్యజించటానికి ప్రయత్నించాలన్నారు. ఆ ప్రయత్నంలో యెంత కృతకృత్యులైతే మోక్షానికి అంత చేరువగా ఉన్నట్టే నన్నారు. తాము నియమబద్ధమైన జీవితాన్ని అలవాటు చేసుకున్నానన్నారు. ఈ సూక్తులతో అశేష ప్రజానీకాన్ని ఆకర్షించారు. శ్రోతల సంఖ్య నానాటికి పెరిగిపోయింది. వారంతా భక్తులయారు. స్వామివారి ఉపన్యాసాలకి తన్మయులయారు. వారి ఔన్నత్యానికి మోకరిల్లారు. త్యాగమంటే వీరిదే నన్నారు. "వారికి మనదృష్టి ఉంటేనా? ఎప్పుడూ ఆధ్యాత్మిక చింతే. నిత్యం ధ్యానంలో నిమగ్నులై ఉంటారు. సామాన్యులా? యోగీశ్వరులు! దైవాంశ సంభూతులు, సంభూతులేమిటి? సాక్షాత్తు దైవమే! కాదంటే కళ్ళోతాయి. వారి విజ్ఞానం? వారి ఇంద్రియనిగ్రహం! వారి ఔదార్యం! అస్మదాదులమా వాటినిగురించి చెప్పటం? ఇంకా ఈ తుచ్ఛమైన శరీరంమీద వ్యామోహం ఉండి, లౌకిక సంబంధాలు త్రెంచుకోలేని మనకి ఆ స్థాయిలో ఉన్నవారు ఏ మర్థమవుతారు? వారి అంతస్థే వేరు. మన అంతస్థే వేరు" అన్నారు వారి ఉపన్యాసాలు విన్న ఒకాయన, ఎవరేనా ఆ స్వాములవారిని గురించి కొంచెం చెడుగా మాట్లాడితే "మనమేమంత గొప్పవాళ్ళమయ్యా? 'తప్పు లెన్నువారు తమ తప్పు లెరుగరు' అని మనమూ, వారికి తప్పులెన్నడం?" అంటారు ఈయన. క్రమక్రమంగా ఆ స్వాములవారిని గురించిన వివరాలు బయటకు వచ్చాయి. వారి నియమబద్ధమైన జీవితపు నిజస్వరూపం బయటపడింది. వారికి ఉదయం రెండు ఇడ్లీ (సాంబారుతో,) నేతితో వేసిన పెసరట్టు, మధ్యాహ్నం భోజనంలోకి తప్పనిసరిగా పప్పూ, ఆవకాయ వగైరా ఊరగాయలు, రాత్రి పరుండే ముందు వెన్న కాచిన నేతితో తయారైన ఒక్క మినపసున్ని ఉండ తప్పనిసరిగా కావాలట. ఆ ఊరినుంచి వెళ్ళేముందు నాటి రాత్రి వారికై వచ్చిన వసూళ్ళు మూడువందలను మించి ఉన్నా, ఆ సొమ్ము చాలనట్టు పెదిమి విరిచేశారట వారు. ఇవన్నీ విన్నవారు ఇన్నాళ్లుగా ఆయన ఉపన్యాసాలు విన్న మహాపరాధానికి లెంపలేసుకున్నారు.

ఈయన చెప్పేదానికి చేసేదానికి ఉన్న తారతమ్యాన్ని చూస్తే నిజంగా బాధ కలుగుతుంది. కాని అంతా ఈయనలా ప్రవర్తించరు. కొందరు తనవాళ్ళు, ఇతరులు అనే భేదం లేకుండా చూస్తారు ఏ వ్యవహారమైనా సరే.

సంవత్సరాంతం జరిగే పెద్ద పరీక్ష తాలూకు పేపర్లు దిద్దేందుకు శాస్త్రిగారికొచ్చేయి ఒక సంవత్సరం. పెద్ద పరీక్ష లవటంమూలాన రద్దీ ఎక్కువగా ఉంది. (ప్రతీ సంవత్సరంలాగే) కాని శాస్త్రిగారు జనానికి కొరుకుబడలేదు. చాలమందికి బాధ కలిగింది. ఒకాయన అన్నారు కూడా: "ఈ నిక్కచ్చి అంతా వదులుతుంది వాడికి నలుగురు పిల్లలు పుట్టేసరికి. అప్పటివరకే ఈ హడావుడి అంతా. మహామహావాళ్ళే మారారు తనదాకా వచ్చేసరికి" అని. ఈ మాటల్లో కొంత నిజం లేకపోలేదు. చాలమంది ముందు చాలా నిక్కచ్చిగా ఉండి, తీరా తన విషయం వచ్చేసరికి పరిస్థితులకి ఇట్టే లొంగిపోయిన మాట నిజం కాని అంతమాత్రంచేత శాస్త్రిగారు కూడా అలా తయారవుతాడనేమిటి? కన్న కొడుకుని కూడా చట్టం ముందు లెక్కచెయ్యని తండ్రులు ఎందరు లేరు? అందుచేత తనదాకా వస్తేనే కాని తెలియదనటం అందరి విషయంలోనూ తగినది కాదు.

---

ఉద్యోగంకోసం దరఖాస్తు పెట్టుకున్న యువకుణ్ణి ప్రశ్నిస్తూ, అధికారి "నీకు యీ పనిలో అనుభవం ఏమీ లేదని దరఖాస్తులో వ్రాశావు. అయినా జీతం ఎక్కువ అడుగుతున్నావు!" అన్నాడు.

యువకుడు "అనుభవం లేకండా పనిచెయ్యడం యింకా ఎక్కువ కష్టం కదండీ!" అన్నాడు.